

# ఎప్పుడు వచ్చినా —

పాలంకి వెంకటరామచంద్రమూర్తి

"ఏమిరా! ఇంకా తెమల్లేదూ? చీరె సింగారించేటప్పటికి పట్ణం మాటు మణిగేటట్టుందే!" అన్నాడు వాకిట్లో ఫొటోలుచూస్తోన్న గురునాథం.

"ఇదిగో అయి పోయింది!" అని నేను గది లోంచి సమాధానం చెబుతో, చెప్పిన పావు గంటలో అవతల పడి, "రెడీ" అన్నాను.

నాబూట్సూ, నాలూజ్ పంట్లామూ, బ్లేజరు కోటూ, ఫెల్టు హాట్టూ, జందేనికి మల్లే మెడకు తగిలించు కున్న కెమెరానూ చూసి, సంతలో బేరానికొచ్చిన ఆవు పెయ్యను పరిశీలించినట్లుగా నన్ను ఎగాదిగా పరికించి, —ఒక చిన్న నవ్వు నవ్వి, "ఊఁ! నడు." అన్నాడు.

నాకు కొంచెం చిన్నతనం అని పించింది వాడి నవ్వుచూస్తే. గోనిగుడ్డను మించిన దళసరితో, 'టన్ను' సామ్మాను పట్టే "పక్క జేబు" అనేగోదాముతో ఉన్న ఆఖద్దరు లుంగీ పాలుచేయలేకపోయిందా నాడ్రెస్సు? కాని, ఆత్మగౌరవాన్ని కాపాడు కోవాలంటే మౌన వ్రతమే మంచిదనే ఉద్దేశంతో, నోరెత్తకుండా, వాడి వెనక్కాలే నడిచాను.

"రెక్క వాలిందోయ్! పెళ్లి నడకలు నడవక చురుగ్గా వెయ్యి అడుగు" అన్నాడు.

పుండు రేగినట్లయింది నాకు వాడి మాటలు వింటూంటే. కాని జోడుతో ఉన్న నేను వాడికి మల్లే పరుగెత్తడం ఎలాగ?

వాడు స్టేషనుకు అడ్డదారి తొక్కి, రైల్వే ఫెన్సింగులోంచి దూరి అవతల పడ్డాడు. నాకు, సూటు మూలాన్ని, వాడికి మల్లే సులభంగా తీగలలోంచి దూరి అవతలకు వెళ్ళడానికి వీలయింది కాదు. కాని దూరడంలో కలిగిన ప్రయాస కంటె, వాడు హేళనచేస్తాడేమో అన్న మనోవేదన ఎక్కువయింది నాకు. నా అదృష్టవశాత్తు; గురునాథం నా వైపు చూడకుండానే, గమ్యస్థానాన్ని దృష్టిలో పెట్టుకుని పరుగెత్తుతున్నాడు.

రేగిన క్రాప్‌ను సవరింపు కొంటూ, నేనూ స్టేషను చేరే టప్పటికి, ట్రెయిను కూడా ప్లాట్‌ఫారం మీద కొచ్చేసింది. గురునాథం "టిక్కెట్లు కొన్నా; ఎక్కు" అని గర్జించాడు, మూడవ తరగతి పెట్టె చూపిస్తూ. నాగుండె ఝల్లుమంది. డిప్యూటీకలెక్టరు గారి కొడుకును, ప్రెసిడెన్సీ కాలేజీలో ఆనర్సు క్లాసు చదువుతూ ఉన్న నేను థర్డుక్లాసు లో ట్రావెల్ చేస్తున్నా నంటే ఎంత అప్రతిష్ఠ? దైన్యాన్ని సూచిస్తూ "ఇంటరేనా కొన లేక పోయావురా?" అన్నాను. "ఉంటే, ఫోర్తుక్లాసు కొనుక్కో వలసిన రోజులలో నీ మొహం, ఇంటరెందుకూ?" అంటూ గురునాథం నన్నా పెట్టెలోనికి గెంటి, వెనక్కాలే దుమికేడు. రైలు కదిలి పోయింది.

ఆదినం, ట్రెయిను దుర్గాడ స్టేషను చేరుకోడానికి మామూలు కంటే ఒక అరగంట ఆలస్యమయింది. ఆ స్టేషన్లో దిగిన ప్యాసింజర్లు, మేమున్నూ మరిముగ్గురు వెలమ దొరలున్నూ. వారితో బాటు మా వాడు కూడా థర్డుక్లాసు టిక్కట్లు స్టేషను మాష్టరు కందిస్తూంటే, నా బ్లేజరు కోటూ నా హేట్టూ చూస్తూ "ఈయనా మూడవ తరగతిలోనే వచ్చాడా!" అన్నట్లుగా తోచింది ఆయనకు. కాని ఆయన నా కేసి అట్టే చూసి ఏడిపించకుండా, మా గురునాథం ఆయన్ని ప్రసంగంలోకి దింపి, బెండపూడికి మార్గం వగైరాలు భోగట్టా చేశాడు.

దుర్గాడ స్టేషనుకు బెండపూడి వెంకటేశ్వరుడి కొండ మూడు మైళ్లకు తక్కువ ఉండదనిన్నీ, అక్కడకు చేరు కోడానికి నడక తప్ప వేరు విధానం లేదనిన్నీ, అన్నవరం వెళ్ళడానికి బెండపూడి నుంచి, ట్రంకురోడ్డు ద్వారా బస్సు మీద వెళ్ళ వచ్చుననిన్నీ స్టేషన్‌మాష్టరు చెప్పేడు. గురునాథం ఆయనకు థ్యాంక్సు కొట్టి, "రావోయ్!" అన్నాడు నాతో.

రాతినేల అది. రోడ్డుకు అటూ ఇటూ తుప్పలు. స్టేషను మొదలు ట్రంకురోడ్డు వరకూ ఉన్న ఆ ఎగుడు దిగుడు రోడ్డుమీద (మైలుకు తక్కువ ఉండదు) నా జోడుతో నడిచేటప్పటికి, నా ప్రాణాలు సొమ్మసిల్లేయి. లెబోరటరీ

(Laboratory) లో అటూ ఇటూ తిరిగేటప్పుడు తప్ప, జోడుతో నే నెప్పుడూ ఇంత దూరం నడవ లేదు. ట్రంకు రోడ్డు చేరేటప్పటికి నా జోడు కరవడం ప్రారంభించింది. అరణాల ఆకు చెప్పులతో తూనీగలా ఎగిరి పోతోన్న గురునాథంతో నడవడం ఎలాగ? యదార్థం వాడికి చెప్పి 'నెమ్మదిగా నడవరా' అందామంటే 'వాడేమి హేళన చేస్తాడో' అన్న భయం పట్టుకుంది. కాని వాడి గమననిరోధాని కని ఒక చిన్న ఎత్తు వేశాను. 'ఎందుకురా ఆలాగ పరుగెత్తుతావ్.? అవతల ముహూర్తం మించి పోతూన్నట్లు! సరదాగా "ఎక్స్కర్షను" (excursion) కొచ్చాం కాని, హడాహుడిగా పరుగెత్తి కాళ్లు విరగ్గొట్టుకోడాని కొచ్చామా?" అన్నాను. "చెప్పులు కరుస్తున్నాయి కాబోలు అబ్బాయికి! అలాచెప్పు!" అంటూ గురునాథం నెమ్మదిగా నడవడం ప్రారంభించాడు. ఇంక నోరెత్తకుండా అడుగు వేశా.

కబుర్లు చెప్పుకుంటూ, వచ్చేశాం కొండ మెట్ల దగ్గరకి. ఎక్క బోతూంటే, "బాబూ చెప్పుల తోటే వెడతారా స్వామిసన్నిధికి?" అన్నాడు ఒకడు. నేను తెల్లబోయి, "గత్యంతరం ఏమిట" ని చూస్తోంటే, మా వాడు "తిరుపతిలో కాని ఇక్కడ ఆబాధలేద" ని డబాయించి ఎక్కడం మొదలెట్టేడు మెట్లు. దేవాలయం తలుపులు మూసి ఉండడం చూసి నప్పుడు మాకు కొంచెం ఆశాభంగం కలిగింది. "అర్చకుణ్ని పిలుచుకు రావలసింది వచ్చేటప్పుడు." అన్నాను నేను. తెలుపు సందులోంచి దేవతా విగ్రహాన్ని చూసి సంతృప్తి పడుతోన్న గురునాథం నా మాట విని, "ఇక్కడ దేవదర్శనం కంటె పూజారి దర్శనం కష్టసాధ్యమని అనుకోలేదు నేను." అన్నాడు.

ఇంతట్లో ఆకాశం మేఘాలతో నిండి పోయింది. "వర్షం మొచ్చే టట్లుంది రోయ్, త్వరగా దిగాలి" అన్నాడు గురునాథం. "ఫొటోలేమీ తియ్యనద్దూ!" అనే మాటలు నాకు నాలుక చిగురు కొచ్చి ఆగి పోయాయి. గురునాథం చఱ్ఱున దిగి పోతున్నాడప్పుడే. నేనూ యథాశక్తిని అవరోహణ మొదలెట్టేను, కాని వర్షం మమ్మల్ని తరుము కొచ్చింది. పెద్దజడే అది. గురునాథం జోడు చేత పుచ్చుకున్ని వేగంగా దిగుతున్నాడు. వాడిణ్ని నే ననుకరించే లోపునా నా నాబ్లేజరూ, నాహేట్టూ, "పస్టు అండు కో" లో రూ. 22—8—0 లను ఇచ్చి కుట్టించిన జోడూ కూడా నీళ్లాడేయి. కింద కొచ్చాక జోడు మళ్లీ తొడుక్కుంటూంటే "ఇంకా తగులడి పోతుందిరా!" అన్నాడు గురునాథం, ఆకుజోణ్ని అలాగే చేతులో ఉంచుకుని. నిజమే; కాని ఊళ్లో అందరూ చూస్తోంటే, జోడు చేత్తో మోసుకు పోవడం అసహ్యమనిపించి తొడుక్కునే నడిచాను.

ఆమేఘం దాని పని అది చేసుకుని వెళ్లిపోవడం తోటే, సూర్యుడు మళ్లీ బయట కొచ్చా

డం. నా గడియారంలో ఒంటిగంట అయి పోయింద ప్పుడే. "గురూ! ప్రొద్దున్న ఎప్పుడో పడేసిన పదార్థాలు అప్పుడే ఆవిరయి పోయి, కడుపు కాలుతోందిరా, "ఈ దిక్కుమాలిన కెమెరాను మోసుకొచ్చాను. కాని, ఫ్లాస్కు నిండా కాఫీ పోసుకొస్తే ఎలా ఉండేది?" అన్నాను. గురూ నెమ్మదిగా జేబులోకి చెయ్యి పోనిచ్చి, ఒక చిన్న మూట పైకి తీసి "ఇది విప్పరా" అని నాకందిచ్చాడు. మూట విప్పి చూస్తిని గదా, అందులో రెండు మినపసున్నుండలూ రెండు పుంజీల చేగోణీలూ ఉన్నాయి. "న్యూసెన్సు. ఉత్తి 'హార్డుస్టఫ్' గా ఇది" అన్నాను. "ఏడిశావ్! ఇలాంటి 'ఐరన్ టిఫిన్' ఇటువంటి సమయాన్ని పడక పోతే ఒక్కక్షణం నిలవగలమా!" అంటూ ఒక్క ఉండ బజాయించాడు. నేను రెండో ఉండ కాస్త చిదిపి నోట్లో వేసుకున్నాను. కాని ఎందుచేతనో నాకు మనస్కరించక శేషభాగాన్ని వాడి కిచ్చివేశాను. "దీని కేమిరా, మోహనడాల్' ను త్రోసిరాజనే పిండివంట!" అంటూ దాన్ని కూడా 'కా' చేసే శాడు.

"ఏమిరా, భోజనం మాట!" అని మళ్లీ జ్ఞాపకం చేశా.

"ఊరు చూస్తే చాలాచిన్నది గా అగుపడుతోందిరా. హోటల్సూ, కాఫీహోటల్సూ ఏమీ ఉండడాని కవకాశం లేదు. చూస్తే" అన్నాడు గురూ.

"కనుక?"

"ఆ చేగోణీలు నమిలి రెండు నీళ్లు త్రాగి ఊరుకో!"

నావళ్లు మండి పోయింది. "మెతక్కంపు కొడుతోన్న ఆ చేగోణీలు తిని ఆకలి తీర్చుకోడమెలాగ? తిండి వసతి లేని ఊళ్లకి ఎక్స్కర్షనేమిటి? ఈ సంగతి నాకు ముందు చెప్ప వద్దా?" అని నాలుగు మాటలూ అనేశా వాణ్ని ఆకలి తీవ్రంలో.

"నాకు మాత్రం తెలుసునా ఇక్కడ పరిస్థితులు? ఇంతకీ నాకీ భోజనం గొడవ స్ఫురించనే లేదు. కాని, కాస్త పోటుకీ పాటుకీ ఆగాలి కాని, అలాగ గంతులేస్తే ఎలాగరా. ఉండు. ఏమిమించి పోయింది? ఎక్కడో అక్కడ వేద్దాం తిష్ఠ. బ్రాహ్మణులున్న ఊరు కాని మాల పల్లె కాదు కదా?" అన్నాడు గురూ.

అక్షణంలోనే, మాకో మనిషి ఎదురొచ్చాడు. మాగురూ అతణ్ని, "గొల్లబోయుడు, రాజద్రోహం చేసిన తనపెళ్లాన్ని నరుకుతోనట్లుగా విగ్రహా లున్నవిట, ఎక్కడ?" అని అడిగేడు. భోజనం భోగట్టా చెయ్యక కాలం వృథాగా గడుపు తున్నాడే వీడు?" అని విచార మేసింది నాకు. చద్దెన్నం తిన్న అమ్మకి వగని ఆకలి తెలియదు కదా! "బొగ్గు పడితే గ కానినే కదల"నని మొండి పట్టు పట్టేను.

కాకతమ్మ గుడి దగ్గరున్న చెఱువు దగ్గరక దారి తీశాడు. "ఊళ్లోకి నడవక చెఱువు కె

దుకు రా ? ” అంటే, “ దిగడానికి !” అన్నాడు, వెటకారంగా మొదట. తర్వాత, నెమ్మదిగా, “ మూడు ఝాములు దాటేక, ఏ బ్రాహ్మడింటో అన్న ముంటుంది ? కాస్త ఓర్చుకుని ఏ కాయో తిని ఉండాలి కాని “భోజనం” అని పునశ్చరణ చేస్తే ఎలాగ?” అన్నాడు. నే నేమీ నోరెత్తలేదు. “స్నానం చేస్తే, కొంచెం శ్రమ నివారణ అవుతుంది గదా!” అనుకుంటూ వాడి వెనక్కాలే వెళ్లేను.

స్నాన మయింది. నెమ్మదిగా ఇదివరకు తువ్వాలులో కట్టి ఉంచిన ఒక పంచచుట్టను విప్పి, అందులోంచి, పట్టుతాపతా బయటకు లాగేడు గురూ! “నాకే భోజనం గొడవే స్ఫురించలేద” న్న వీడు పట్టుతాపతా ఎలా పట్టుకొచ్చాడో అని పించింది నాకు. తాపతా విప్పి, సాపుగా బిళ్ల పంచ కట్టు వేశాడు. భోజన మెక్కడో తేల కుండా విద్యుంకుడు లా పట్టుతాపతా ఎందుకురా సింగారించుకు న్నావురా ?” అన్నా. “ పట్టుబట్టతో ఊ రమ్మట నడిచా మంటే, “ వీళ్లకి భోజనం కావాలి ” అని చాటి చెపుతుంది ఈ పట్టుగుడ్డ. పెట్ట దలచుకున్న వాడెవడేనా ఉంటే, పిలుస్తాడు మనం నోరు తెరవ కుండానే. నోరు తెరచి అడిగి, తీరా ‘ లేదన ’ పించు కోడం వల్ల కలిగే ఆశాభంగం, మనస్సు చివుక్కు మనడం దీనివల్ల మనకు తప్పి పోతున్నాయి ” అన్నాడు గురూ. “ నియ్యోగులం ” అన్న మర్యాద నిలబెట్టు కున్నావురా” అను కుంటూ “ఏమి జరుగు తుందో ” అని ఎదరు చూస్తున్నా.

ఇంతలో చెఱువు కావలి ఒడ్డున ఉన్న పావంచాల మీద ఇద్దరు బ్రాహ్మలగుపించారు. అందులో ఒకాయన నీటి ఒడ్డుకు వచ్చి చేతులో ఉన్న మూట విప్పి, ఏదో పైకి తీసి నీటిలోకి విసిరెయ్యడం మొద లెట్టేడు. మా వాడు పసిగట్టేడు. “ ఆ బ్రాహ్మ డింట్లో ఈ రోజున తద్దినం రా ! ” అన్నాడు.

ఇంక మా గురూ హడావుడి ఏమని చెప్పను? యుద్ధంలో ‘ కమ్మాండరు ’ సోల్జర్లకి ఆర్డర్లి చ్చే టట్లు గా సన్నాజ్ఞాపించడం మొదలెట్టేడు. నా డ్రెస్సంతా ఓచిన్న మూటలో కెళ్లి పోయింది. వాడి నీరుకావి ముతక ధోవతితో నాకు బిళ్ల పంచకట్టు తయారయింది. నా జోడూ వాడి జోడూ కూడా ఓ తువ్వాల్లో దాక్కున్నాయి. ఇదంతా రెప్పపాటు కాలంలో జరిగిందంటె నమ్మండి ! మరు క్షణంలో గురూ, “ నడు ” అన్నాడు.

ఆ బ్రాహ్మణు లింకా నీటి దగ్గరే ఉన్నారు. ‘ వాళ్ల దృష్టిపథంలో పడడమే వీడి ఉద్దేశం ’ అని అనుకుంటున్న నాకు ఆశ్చర్యం కలిగేటట్లు గురూ వాళ్లకంట పడకుండా, జాగ్రత్తగా జారుతున్నాడు. ఆలోచన కవకాశం లేని నేను వాడి వెంట పరుగెత్తేను, జోళ్లమూట పుచ్చుకుని !

క్షణంలో ఓ కోమటి కొట్టు దగ్గర కొచ్చాం. "షావుకారూ, మామూట లిక్కడ పెట్టుకుంటాం కొంచెం" అంటూ, ఆతడు చెప్పేదేముటో వినిపించుకోకుండానే, ఆ మూటలు రెండూ ఒక్క చోట పడేశాడు గురూ. ఇంతలో ఆ బ్రాహ్మలు మాల సంపర్క మెక్కడ తగుల్తుందో అనే భయంతో జాగ్రత్తగా ముందు చూసుకుంటూ నడిచారు. "రా" అంటూ మావాడు కొంచెం దూరములో వాళ్ల ననుసరించాడు. వాళ్లిద్దరూ ఓ గృహంలో ప్రవేశించడం చూశాం. "నువ్వు గప్‌చిప్‌గా ఉండాలి" అన్నాడు గురూ. ఆ బ్రాహ్మలిద్దరూ లోపలగా దొడ్లోకి వెళ్లడం చూశాం. ఎరుగున్న ఇల్లులాగ లోనికి వెళ్లేము. భోజనశాల మాకెదురయింది. రెండు పీటలు వాల్చి ఉన్నాయి. ఎదురుగా విస్తళ్లు పరిచే ఉన్నాయి. ఈ పంక్తి కెదురుగా వాల్చి ఉన్న ఐదారు పీటలలోనూ మావాడు ఒక దాని మీద చతికిలపడి, "కూర్చోవోయ్, అలాగ!" అన్నాడు. ఈ సందడి విని వంటవసారా లోంచి వచ్చి చూస్తున్న ఇల్లాల్ని మాగురూ, "అమ్మా రెండు చెంబులు కావలండీ!" అన్నాడు. క్షణంలో రెండు చెంబులూ సప్లయి చేయబడ్డాయి ఉదకంతో. శాస్త్రోక్తంగా నీళ్లు నోట్లో పోసుకుని, కేశవా, నారాయణా, అనడం మొదలెట్టి, వచ్చినంత మట్టుకి పైకి గట్టిగా, ఉచ్చరిస్తూ, రాని భాగం మనస్సులో అనుకుంటున్నట్లు నటిస్తూ సంధ్యావందనం చేస్తున్న గురూని చూస్తే నాకు నవ్వు రాబోయింది. నేనేమి చెయ్యడానికి తోచక ఇంటి కప్పు వైపు చూస్తూ మీసమేషాలు లెక్క పెడుతోంటే, గురూ "గంధాక్షతలు అందుకోవోయ్" అన్నాడు. సగం గంధాన్ని ఎడమ అరచేతిలో వేసుకుని నీళ్ల చుక్కలు వేసి కలుపుతూంటే ఆయింటి యజమాని, రెండో బ్రాహ్మడు కూడా, పాద ప్రక్షాళన కావించుకుని దొడ్లో నుంచి వచ్చారు. నా గుండె ఝల్లుమంది. నా ఆకలి చచ్చి పోయింది. గొంతుకలో ఏదో పెద్ద పిండి ముద్ద చిక్కుకున్నట్లు తోచింది. నే నెటువైపు చూడాలో తోచటం లేదు నాకు. మా కెదురుగా ఉన్న ఆసనాల మీద వారిద్దరూ కూర్చున్నారు మావైపు చూస్తూ. గురూ నుదుటినిండా గంధాన్ని అడ్డంగా దిద్ది, ఇంచు మించుగా దమ్మిడీ కాసంత అక్షంతలు పెట్టుకుని, పిమ్మట గంధాక్షతల్ని యింటి యజమాని కందిచ్చి, "ఉంచుకోండ" న్నాడు. క్రాప్ లేని ఆ ముఖానికి, ఆబొట్టు ఓ వింత సోయగాన్ని తీసుకొచ్చింది.

ఈ లోపుగా వడ్డన ప్రారంభమయింది. మా వాడి సంధ్యా వందనం పరి సమాప్త మయింది! గురూ ప్రసంగం మొదలెట్టేడు. "ఇటువంటి పుణ్యాదినాన్ని కాలం చేసిన మీపెద్దలు చాలా ధన్యులండీ" అన్నాడు గురునాథం. మా గురూకి నాడు ఏకాదశి తిథి అని, ఆ రెండో

బ్రాహ్మణుడు చేసే సంధ్యావందనంలో తేలిందన్న సంగతి గ్రహించాను. ఆ ప్రసంగంలో అనేక విషయాలు వెళ్లేయి. మావాడు తన యుక్తి నంతా వినియోగించి, సమంజసంగా మాట్లాడుతున్నాడు. తుదకు మాయింటిపేరు, మానివాసస్థలం వగైరాలు చెప్పవలసొచ్చింది. నాగుండె 'లటుకు' మంటోంది, నేను డిప్యూటీ కలెక్టరు గారి కొడుకునని ఎక్కడ చెప్పేస్తాడో అన్న భయం చేత. ఆబద్ధం లేకుండా మాయింటి పేర్లు మటుక్కు చెప్పేశాడు. వాళ్లకు మేము నియోగుల మని మాత్రం తేలింది.

వడ్డన పూర్తి అయేక భోజనానికి దొరకపుచ్చుకున్నాం. మాగురూ తిన్నటువంటి సున్ని వుండల కోశానికీ, ఇప్పుడు గారెల చేతా, అరిసెలచేతా నిండు తోన్న కోశానికీ సంబంధం ఏమీ లేనట్లుగా తోచింది నాకు. ఇద్దరం వాళ్లకకస్మాత్తుగా అతిథుల మయ్యా' మన్న మాట మావాడు మరిచి పోయినట్లుగా ఉన్నాడు చూస్తే. నోటితో నైనా 'వద్ద' నకుండా తినడం మొదలెట్టేడు. నా ఆకలిని ఆక్షేపించిన గురూకి ఇంత ఆకలెక్కడ నుంచి వచ్చిందో అని ఆశ్చర్య పోయాను.

వెనక్కాల ఆడవాళ్లకు పదార్థాలలో కొంత లోపం కలిగి వుండాలి. ఏమంటే, భోజనాలయి మేము ఇవతల పడ్డాక, ఆయిల్లాలు "ఎప్పుడు తీసుకొచ్చినా అర్థాంతరం గానే తీసుకు రావడం. 'ఏ అభాసవుతుందో' అనే ఆలోచనైనా వుండదు మొగాళ్లకు!" అని సణుక్కుంటూంది పాపం. నాకు వినపడ్డ ఆ మాటలు మాగురూకి వినిపించి ఉండక పోవు. వాడు ఏమీ ఎరగనట్లు నిశ్చింతతో తములపాకులు నములుతున్నాడు. ఆమాటలు విన్న యజమాని ఆశ్చర్యాన్ని తెలియచేస్తూ, "ఇదేమిటే! నే తీసుకొచ్చానంటా వేమిటి వాళ్లని? బ్రాహ్మల్ని 'లేదని' పంపి వెయ్యడం కూడదని నువ్వే భోజనాని కుండ మన్నావనుకుంటూంటే, నే తీసుకు వచ్చానంటా వేమిటి?" అన్నాడు. ఆమాటలూ కూడ విన్న నేను గురూతో "ఇక మన మిక్కడుంటే మాట దక్కదు నడవరా" అన్నా మెల్లగా. తాంబూలం సామగ్రిలో ఏలక్కాయ కోసం వెదుకుతో ఆయజమాని వచ్చే దాకా అలాగే కూచున్నాడు.


నాకు తిన్న పదార్థ మంతా నీరయి పోయింది, ఏమి అవమానం జరుగ బోతోందో అనే భయంచేత. మాగురూ నెమ్మదిగా లేచి, ఆబ్రాహ్మడి కేసిచూస్తూ అతి సీరియస్సుగా "అయ్యా, శాస్త్రుల్లు గారూ, మమ్మల్ని "నేను పిలవ లేదంటే నేను పిలువ లేద" ని మీరూ మీ ఆవిడా తగవు లాడుకుని ఆఖరుకి మేము ఎవరిచేత ఆహ్వానింప పడకుండా వచ్చినట్లే తేల్చేశారు!" అన్నాడు. పాపం ఆ బ్రాహ్మణుడు నిలువునా నీరై పోయాడు.

ఆయన భార్య కూడా విసుగుచేత అనుకున్న మాటలకు పశ్చాత్తాప పడ జొచ్చింది. "ఇదే మిటి! వీడు తిన్నదే కాకుండా వాళ్లతో కయ్యానికి కాలు త్రవ్వ తున్నాడ"ని నాకు వినుకు పట్టుకుంది. మాగురూ, "అయ్యా, వినండి, ఇతగాడు నాభావమరది. కనుక ఇతనికి నే భావ మరది నన్నమాట. ఇతడు నన్నాహ్వానించాడు. ఆ మర్యాదే అతనికి నే చేయవలసొచ్చింది. కనుక..." అని పక్కున నవ్వేడు. నాక ప్రయత్నంగా నవ్వొచ్చింది. ఆ బ్రాహ్మణుడు కూడా నవ్వుతూ, "బాబూ మీరభాగ్యగతులు; దైవ సమానులు. మీరీ ప్రాంతాలకు వచ్చినప్పుడల్లా మాయింట్లో ఒక పూట వుండి మరీ వెళ్లాలి" అన్నాడు.

శలవు పుచ్చుకుని కోమటి కొట్టుకే సివస్తూ న్నప్పుడు "ఎంత పని చేశావురా!" అన్నా గురూతో. "ఏమిటను కున్నావ్! శాశ్వతమైన పద్ధుకూడా పడింది!" అన్నాడు.

——:o:——


# వైద్యవిషయములో దైవము మీద ఆధారపడడము దోషము




విశేషించి శిశువుల విషయములో మరీ దోషము

జమ్మి వెంకటరమణయ్యగారి

## లివర్ క్యూరు (రిజిస్టరుడు)

యోగ్యమయినది. ఇంతకంటే యోగ్యమయిన మందు మరొకటి లేదు. శిశువుల లివరు మీద దివ్యముగా పని చేస్తుంది. అందువల్లనే డాక్టర్లు దీన్నే వాడమంటారు. పయిగా వారి స్వంత బిడ్డలకు కూడా దీన్నే యిస్తున్నారు.

ఇది వాడినప్పుడు అద్భుతముగా నయము అవుతుంది. అందువల్లనే యిది ఒక అద్భుతమయిన మందు అంటున్నారు.

**మదరాసు:**
౮, శాస్త్రై వీధి మైలాపూరు

**కలకత్తా:**
125, హారిశాన్ రోడ్డు